

యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

ఏకేయూ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని వైస్ చాన్సలర్ అంజిరెడ్డి అన్నారు.

- 10లో..



నిమ్జ్ భూముల పరిశీలన

పామూరు మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన నిమ్జ్ భూములను పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వళవన్ పరిశీలించారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం 32 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండలంలోని పొదలకుంటపల్లె గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో గురువారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం న్యూ కేటగిరీ ఎడ్లకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం 8790469322 సెల్ నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

నిరుద్యోగులకు జాబ్ మేళాలు వరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: నిరుద్యోగులకు జాబ్ మేళాలు వరంలాంటివని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయాలు సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 391 మంది ఉద్యోగాల కోసం హాజరు కాగా వారిలో 122 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 55 మంది షార్ట్ లిస్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా జాబ్ క్యాలెండర్లు విడుదల చేసి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొనగా 650 ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు పొందాలని సూచించారు. డీఎస్‌డీఓ లోకనాథం మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో శాసనసభ్యుల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ఆర్ లోకనాథం, డీఈఓ టీ భరద్వాజ్, జేడీఎం రజినీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్య, వైస్ ఎంపీపీ సోముదుర్గారెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సచివాలయం కన్వీనర్ వీ కోటిరెడ్డి, కౌన్సిలర్ బాబురావు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉద్యోగాల భర్తీకి చర్యలు

ఒంగోలు అర్బన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2022–23 సంవత్సరానికి విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులు) డీఎస్‌సీ పరిధిలో గ్రూప్–4 సర్వీసులో కేటాయించి భర్తీకాని టైపిస్ట్, టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్/డీఈఓ, టైపిస్ట్, నాన్‌డీఎస్‌సీ పరిధిలో నాల్గవ తరగతి సర్వీసులో ఆఫీస్ సబార్డినేట్, కాపలాదారు, సేవిక, స్వీపర్, కామాటి తదితర ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు దివ్యాంగుల శాఖ ఏడీ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు http://www.prakasam.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వెబ్‌సైట్ నుంచి పొందిన 15 రోజుల్లో జిల్లా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

శ్రీరామనవమిని సంతోషంగా జరుపుకోవాలి

ఒంగోలు: శ్రీరామనవమి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. శ్రీరాముని ఉత్తమ గుణగణాలు మనందరికీ ఆదర్శమని, అనుసరణీయం అన్నారు. సీతారామచంద్రులను ఆదర్శంగా తీసుకుని జీవిస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరుతున్నామని పేర్కొంటూ భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలు గిత్త.. సొగసు, పొగరు చూసేందుకు రెండు కళ్లు చాలవు. పర్వత శిఖరాన్ని తలపించే మూపురం, లయబద్ధంగా కదిలే గంగడోలు, కొనలు తేరిన కొన కొమ్ములు, కొండలనైనా ఢీకొట్టే దేహదారుఢ్యం ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు రూపం. నడకలో రాజసం, నడతలో ధీరత్వం.. కాలు దువ్వి రంకె వేసిందో రచ్చరచ్చే. పందెం బరిలోకి దిగితే బరువైన బండను సునాయాసంగా ఈడ్చుకెళ్లి గిరిగీతను దాటేయడంలో అజేయుడు. బండలాగుడు పోటీల్లో యజమాని పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయదు. ఎన్నో అపురూప లక్షణాలు సొంతం చేసుకున్న ఈ వృషభరాజు ముందు ఎలాంటి జాతి ఎద్దులైనా బలాదూర్ కావాల్సిందే. సై అంటే సై అంటున్న ఈ బసవరాజుపై ప్రత్యేక కథనం.



- ఉభయ రాష్ట్రాల్లో జరిగే బండలాగుడు పందేల్లో సై అంటే సై
- ఒంగోలు బసవడే.. అజేయుడు
- మూడు రోజులకోసారి శిక్షణ
- ప్రత్యేక పౌష్టికాహారం
- విజయం సాధించిన గిత్తలకు భారీ గిరాకీ

ఒంగోలు డెస్క్

బసవరాజు

విజయ దరహాసం

తెలుగు రాష్ట్రమైనా.. తమిళ, కన్నడ రాష్ట్రాలైనా బండలాగుడు పోటీల్లో ఒంగోలు బసవడే.. అజేయుడు. రింగ్‌లోకి దిగితే కింగే. ఒంగోలు గిత్తల పేరెత్తితే.. వారెవ్వా అనాల్సిందే. సంక్రాంతి, పర్వదినాలు, ప్రముఖ ఆలయాల తిరునాళ్ల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లో బండలాగుడు పోటీలు జరుగుతుంటాయి. ఎక్కడ బండలాగుడు పోటీలు జరిగినా.. జిల్లాకు చెందిన ఒంగోలు జాతి గిత్తలు బరిలోకి దిగుతాయి. సూపర్ యానిమల్‌గా పేరొందిన ఈ గిత్తలను యజమాని విజయగర్వంతో బరిలోకి దించుతారు. అంతే విశ్వాసంతో పందాన్ని గెలుస్తాయి. జిల్లాకు చెందిన రైతులు రెండేళ్లుగా పాల్గొన్న పోటీల్లో మూడింతలు విజేతలుగా నిలిచారంటే వీటి ప్రత్యేకత ఏంటో తెలుస్తుంది. వీటినే నమ్ముకున్న రైతులు పసిపిల్లలతో సమానంగా చూసుకుంటారు. ప్రతిక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పందేల్లో పాల్గొనే రైతులకు వచ్చే ఆనందం కోటి రూపాయలు డబ్బులు ఇచ్చినా కలగదంటారు.



పొట్లపాడులో జరిగిన ఎడ్లపోటీల్లో పోతిరెడ్డి నాగిరెడ్డికి చెందిన ఎడ్లజత

పోటీలు ఇలా..

బండలాగుడు పోటీలు వివిధ కేటగిరీల్లో జరుగుతాయి. పాలపండ్లసైజ్, రెండు, నాలుగు, ఆరు పండ్లసైజ్ కేటగిరీ, సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటారు. ఎక్కువ మంది సీనియర్, జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీటి పోషణ ఖర్చు పెరిగిపోవడంతో దూర ప్రాంతాల్లో జరిగే పెద్ద పోటీలకు మాత్రమే వెళ్తుంటారు. ప్రైజ్ మనీ ఎక్కువగా ఉంటేనే రైతులకు ఆదాయం ఉంటుంది.విజేతలైన ఎద్దులకు ఎద్దులను బట్టి అమ్మకాల్లో మంచి ధర పలుకుతుంది. జత రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతాయి. నంద్యాల, కడప, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు, తెలంగాణలో కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, గద్వాల్, ఖమ్మం, హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కువగా పోటీలు జరుగుతుంటాయి.

ప్రత్యేక మెనూ..

ఒంగోలు జాతి ఎద్దులు ఎంతటి భారాన్ని అయినా అలవోకగా మోయగలవు. పోటీల్లో పాల్గొనే ఎద్దులను రైతులు ప్రత్యేకంగా పెంచుతారు. వీటికి ప్రత్యేకంగా మెనూ ఉంటుంది. ఆహారాన్ని క్రమపద్ధతిలో ఇస్తారు. ఒక పూట ఉలవలు, రాగులు, జొన్నలు, కొర్రలతో కలిపి సంగటిగా చేసి పెడతారు. మరో పూట ఉలవలు, బెల్లం కలిపి ప్రత్యేకంగా వండిన ఆహారాన్ని తినిపిస్తారు. ఉదయం పది లీటర్లు, సాయంత్రం పది లీటర్ల పాలు తాగిస్తారు. ఇలా పౌష్టికాహారాన్ని పెడతారు. ఖర్జూరం, ఎండిన వరిగడ్డి, జొన్నగడ్డి కూడా ఆహారంగా ఇస్తారు.



నంద్యాలలో జరిగే పోటీలకు సిద్ధమైన ఎద్దులు

నిరంతరం శిక్షణ:

బండలాగుడు పోటీల్లో పాల్గొనే గిత్తలకు నిరంతరం శిక్షణ ఇస్తారు. మూడు రోజులకొకసారి 12 క్వింటాళ్ల బరువు ఉన్న బండతో ప్రాక్టీస్ చేయిస్తారు. 200 అడుగుల దూరం 25 నిమిషాల్లో పూర్తి చేసేలా మెళకువలు నేర్పుతారు. ఇలా 25 రౌండ్ల చొప్పున శిక్షణ ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా మనుషులను పెట్టుకుంటారు. ఉదాహరణకు ఒక రైతు దగ్గర ఎడ్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏడుగురిని పెట్టుకుంటే వారందరికీ నెలకు రూ.లక్ష వరకు ఖర్చు చేస్తారు.



పందెపు ఎద్దుకు స్నానం చేయిస్తూ..

అంతా లక్కే..



పది ఎకరాల్లో వ్యవసాయం కోసం ఎడ్లను కొన్నాను. తర్వాత చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న ఎడ్ల పందేల పోటీల్లో పాల్గొన్నా. బహుమతులు గెలవడంతో పోటీలపై మక్కువ పెరిగింది. పదహారేళ్ల నుంచి చిన్నా, పెద్ద పోటీల్లో పాల్గొంటూ వస్తున్నాను. అప్పట్లోనే రెండు లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాను. తర్వాత ఆరేళ్ల కిందట నాలుగు లక్షలు వెచ్చించి మరో జత ఎడ్లను కొనుగోలు చేశాను. క్రమంగా బండలాగుడు పోటీల్లో పాల్గొంటున్నా. ప్రస్తుతం రూ.8 లక్షలకు ఒక జత, రూ.9 లక్షలకు మరో జతను కొన్నా. గతేడాది 20 పోటీల్లో, ఈ ఏడాది ఇప్పటికే 20 పందేలు గెలుచుకున్నా.

– లక్కు మునీశ్వరయ్య, జేసీ అగ్రహారం, బేస్తవారిపేట మండలం

పేరు కోసమే..



మొదట్లో సరదాగా ఎడ్ల పందేల్లో పాల్గొన్నా. ఎద్దులు గెలవడంతో విజయకిరీటం వచ్చినట్టు అనిపించింది. 32 సంవత్సరాలుగా పోటీల్లో పాల్గొంటున్నా. మొదట్లో పొట్లపాడు రామయోగి తాత తిరునాళ్లలో పోటీచేశాం. మొదటి బహుమతి 5 తులాల వెండి గంట ఇచ్చారు. నవంబరు నుంచి జూన్ నెల వరకు పోటీలు జరుగుతుంటాయి. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగే పోటీలకు వెళతాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 18 పోటీల్లో పాల్గొన్నాం. 10 మొదటి బహుమతులు, 8 ద్వితీయ బహుమతులు పొందాం. పోటీలకు వెళ్లటానికి ప్రత్యేకంగా ఒకలారీ కొనుగోలు చేశాను. మా ఎద్దులను మా మామ కాటంపెద్దిరెడ్డి, సోదరుడు పోతిరెడ్డి చంద్రారెడ్డి పర్యవేక్షిస్తుంటారు.

– పోతిరెడ్డి నాగిరెడ్డి, మాజీ సర్పంచ్, కాటంవారిపల్లె, కురిచేడు మండలం

సీఎం నివాళులర్పించడం తప్పేనా?

- ఈనాడు, ఆంధ్రజ్యోతి కథనాలపై వరికూటి అశోక్‌బాబు ఫైర్
- అంతిమ సంస్కారానికి కనీస ఏర్పాట్లు చేసుకోకూడదా
- దానిని ఆర్భాటం అంటూ తప్పుడు రాతలు రాస్తారా
- టీడీపీ హయాంలోనే దళితులపై దమనకాండ
- కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు



విలేకర్లతో మాట్లాడుతున్న కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వరికూటి అమృతపాణి

ఒంగోలు: మరణించిన తల్లికి కనీస అంతిమ సంస్కార కార్యక్రమాలు నిర్వహించడం కూడా ఆర్భాటం అంటూ దళితుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ప్రచురించిన వార్తా కథనాలు తననే కాకుండా తమ కుటుంబ సభ్యుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశాయన్నారు. తమ పట్ల ఆత్మీయత కనబరిచిన సీఎం వస్తున్న సమయంలో రక్షణ చర్యల్లో భాగంగా అధికారులు చర్యలు చేపడితే దానిని తప్పుబట్టారన్నారు...భౌతికకాయం సందర్శన సమయంలో జనం తోసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడితే దానిని విమర్శించడం కనీస నైతికత అనిపించుకుంటుందా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు మాదిరి ఇరుకురోడ్లలో తాము సభలు పెట్టి 11 మంది ప్రాణాలను బలిగొనేందుకు సిద్ధంగా లేమని, గుంటూరులో ముగ్గురు, గోదావరి పుష్కరాలలో ఎంతోమందిని బలిగొన్న ఘటనలు ఆర్భాటం అవుతాయని.. దమ్ముంటే వాటిపై కథనాలు వెలువరించాలని సవాల్ విసిరారు.

దళితులపై దమనకాండ ఏదైనా ఉందంటే అది టీడీపీ హయాంలోనే:

ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నా సీఎం పరామర్శించారని వార్త రాస్తారని, అలా కాకుండా దానిని తప్పుపడుతూ వార్త రాయడం వెనుక రామోజీ, రాధాకృష్ణల రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. కేవలం చంద్రబాబుకు రాజ్యాధికారం కట్టబెట్టాలనే ఏకైక కుట్రతో దళిత కుటుంబంపై వార్త కథనంతో దాడిచేశారన్నారు. కారంచేడు ఘటనలో దళితులను దారుణంగా నరికి చంపింది ఎవరు, అది టీడీపీ హయాంలో కాదా అంటూ ప్రశ్నించారు. జీతాలు పెంచాలంటూ ధర్నా చేసిన వారిపై గుర్రాలతో తొక్కించి మట్టుబెట్టింది ఎవరు, కోనసీమ జిల్లాకు అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేయాలంటూ డిమాండ్ చేసి, జిల్లాకు జగన్ ఆపేరు పెట్టగానే ఆ జిల్లాలో ఉన్న ఎస్సీ, బీసీ మంత్రి, ఎమ్మెల్యేల ఇళ్లను దగ్ధం చేసింది ఎవరో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఎర్ర చందనం కాంట్రాక్టర్లను వదిలిపెట్టి 30 మంది దళితులను వరుసగా కూర్చోబెట్టి కాల్చి చంపిన ఘటనపై ఎందుకు కలాలు ముందుకు సాగలేదన్నారు. ఇంట్లో జరిగిన శుభకార్యాన్ని వివరించి, వారు తిరుమల దర్శనానికి వెళుతున్న విషయాన్ని బత్తుల అశోక్ కుమార్ రెడ్డి చెప్పి మరీ వెళితే ఎందుకు విషపు రాతలు రాశారంటూ మండిపడ్డారు.

కొండపిలో అరాచకాలపై ఎందుకు పెదవి విప్పరు:

కొండపిలో సాక్షాత్తు అక్కడి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి, దామచర్ల సత్యలు ఎన్‌ఆర్‌ఈజీఎస్, స్వచ్ఛభారత్ పథకాల్లో బాత్‌రూములకు సంబంధించి మంజూరైన సొమ్మును దుర్వినియోగం చేశారంటూ సాక్ష్యాధారాలతో వివరించినా ఆంధ్రజ్యోతి, ఈనాడు ఎందుకు ప్రచురించలేదోనని ప్రశ్నించారు. ఇంకా చెప్పాలంటే దళితుడినైన తనపైనే 198/2018 ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తమ నియోజకవర్గంలో రామాయపాలెం దళిత కుటుంబాలు తమకు ఓటేశాయన్న కక్షతో వారిని వెలేసిన వార్తను ఎందుకు ప్రచురించలేదన్నారు. కొండపిలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తాను ఆటంకం అని భావించి సీఎం చెబితే కార్యకర్తగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని తెల్లకాగితంపై సంతకం చేసి మరీ చెబుతున్నానన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి మాట్లాడుతూ 15 సంవత్సరాల చంద్రబాబు పాలనలో దళితులకు దక్కింది ఎంత, నాలుగేళ్ల జగన్‌పాలనలో దళితులకు ఏం లభించిందో ప్రతి దళిత కుటుంబం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. రోజురోజుకూ తప్పుడు రాతలతో సమాజంలో అశాంతిని సృష్టించాలనుకుంటున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ5లకు దూరంగా ఉంటేనే దళితులు రాజ్యాధికారంవైపు ముందుకు సాగగలరన్నారు. ఈనాడు రాష్ట్ర పేజీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబుకు ద్వితీయ స్థానం అని రాస్తే, జిల్లా పేజీలో మాత్రం సీఎం మందలించాడంటూ ఒకే పత్రికలో రెండు కథనాలు రావడమే ఆ పత్రిక నైతికతను స్పష్టం చేస్తుందన్నారు. సీఎంను తమ తల్లి భౌతిక కాయం వద్దకు పరామర్శకు తీసుకువచ్చిన బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞులుగా ఉంటామని పేర్కొన్నారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన చైర్మన్ కృష్ణ

- మరో రూ.4 కోట్లతో త్వరలో సచివాలయాల పరిధిల్లో పనులు మంజూరు
- రూ.94.92 కోట్లతో మార్కాపురం మున్సిపల్ 2023–24 బడ్జెట్ ఆమోదం
- బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి పార్టీలతో సంబంధం లేకుండా కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ హాల్లో బుధవారం చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 35 వార్డుల్లో దాదాపు రూ.30 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశారని, త్వరలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు. రోడ్లు, డ్రైనేజ్, వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ట్యాంక్ వద్ద కళాక్షేత్రం నిర్మించేందుకు సహకరిస్తానన్నారు. పార్టీల భేదం ఎక్కడా చూపట్లేదన్నారు. కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, కౌన్సిలర్ డాక్టర్ చెప్పలి కనకదుర్గ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో 17 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారని, గెస్ట్, రెస్ట్‌రూం నిర్మించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే కేపీ వచ్చే సమావేశంలో తీర్మానం ఆమోదించి వెంటనే నిర్మాణం చేపట్టాలని అధికారులకు, కౌన్సిల్‌కు సూచించారు. కౌన్సిలర్లు దొడ్డా భాగ్యలక్ష్మి, కొట్టె నగేష్, సిరాజీలు మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని చెప్పగా చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ కుక్కలను పట్టుకుంటే బ్లూక్రాస్ సంస్థ వారు అధికారులపై కేసులు నమోదు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని చెప్పగా ఎమ్మెల్యే కేపీ జోక్యం చేసుకొని వచ్చే సమావేశానికి బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధులను పిలిపించి వారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఆవులకు సంబంధించి గోసంరక్షణ కమిటీని ఏర్పాటు చేసి పట్టణంలో ఉండే గోవులను అక్కడ ఉంచే ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కౌన్సిలర్ దారివేముల హర్షిత బాబి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పూల సుబ్బయ్య కాలనీలో ఉన్న మున్సిపల్ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని, పైప్ లైన్‌లకు మరమ్మతులు నిర్వహించాలని కోరారు.

రూ.94.92 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం

మార్కాపురం పురపాలక సంఘానికి సంబంధించి 2022–23 సంవత్సరానికి అంత్య నిలువ రూ.22,42,14,296 తో ప్రారంభించి ఆదాయం రూ.72,50,50,820 తో కలుపుకొని మొత్తం రూ.94,92,65,116 తో బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 40 శాతం నికర ఆదాయం నుంచి మురికివాడల్లో నీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులకు కేటాయించగా, 15 శాతం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి, 7.5 శాతం షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి, 5 శాతం స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధికి కేటాయించారు. కార్యక్రమంలో కమిషనర్ గిరికుమార్, డీఈ సుభాని, మేనేజర్ శ్రీనివాసన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను దర్శించుకుంటున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

నేడు సీతారామ కళ్యాణం

- బాలినేని నివాసం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఒంగోలు: శ్రీరామనవమి సందర్భంగా స్థానిక లాయరుపేటలోని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా చలువ పందిళ్లు వేశారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. స్థానిక కేబుల్ చానళ్ల ద్వారా లైవ్ ప్రసారం ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. బుధవారం ఉదయం ఉత్సవ మూర్తుల విగ్రహాలు బాలినేని నివాసం వద్దకు రాగా వేదపురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని దంపతులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు వైభవంగా స్వామివారి కల్యాణం జరగనుంది. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ప్రసాదంతోపాటు భోజన ఏర్పాట్లు చేశారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించాలని బాలినేని దంపతులు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

వెలుగొండ గురుకులానికి పతకాల పంట



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

కొనకనమిట్ల: చిత్రలేఖనంపై డ్రీమ్ యంగ్ వరల్డ్, చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ విజయవాడలో ఇటీవల నిర్వహించిన పదో జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శన పోటీల్లో కొనకనమిట్ల మండలం వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు ఆర్ట్స్ టీచర్ కె.ప్రసాదరావు పసిడి పతకాలు సాధించారు. ఆ మేరకు విజయవాడలో ఏర్పాటు చేసిన అవార్డుల కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు డ్రీమ్ రమేష్ చేతుల మీదుగా ఉపాధ్యాయుల విభాగంలో పాఠశాల ఆర్ట్స్ టీచర్ ప్రసాదరావుతో పాటు 15 మంది విద్యార్థులు 10 గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్ మెడల్స్ చిత్ర కళాకారుల సమక్షంలో అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాం కోటేశ్వరరావు తెలిపారు. జాతీయస్థాయి బాల చిత్రకళా అవార్డును పాఠశాల విద్యార్థి భూదాల అభిషేక్ అందుకున్నాడు. చిత్ర లేఖనానికి సంబంధించి ప్రకృతి సంరక్షణ, వన్య సంరక్షణ, స్త్రీ, పురుష సమానం, మై విజన్ ఫర్ ఇండియా ఇన్ 2050 అనే అంశాలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు తిమోతిరాజు, మహేష్, అభిషేక్, రక్షిత్, విష్ణుబాబు, ఇమ్మానియేలు, సాయిఅఖిల్, బానుచంద్ర, శివ చైతన్య, యస్వంత్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆదర్శ్‌కుమార్, శివ సాయి, మోహన్‌వంశీ, లోకేష్, అరుణ్‌కుమార్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. అవార్డులు పొందిన ఆర్ట్స్ టీచర్ ప్రసాదరావు, విద్యార్థులను మానవహక్కుల సంఘం జాతీయ కార్యదర్శి టి.భాస్కర్, డైమండ్ సెక్యూరిటీస్ ఎండీ దారా బాలకోటేశ్వరరావు, ముఖ్య అతిథులు బాను ప్రకాష్, విష్ణుప్రియ, డ్రీమ్ డైరెక్టర్ రమేష్, చిత్రకళాసాగర్ కళాకారులు పాల్గొని అవార్డులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన వారిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు అభినందించారు.

అవినీతిపరులకు అండగా మోదీ

ఒంగోలు టౌన్: దేశంలోని అవినీతిపరులకు అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్ష పార్టీలను అవినీతి పార్టీలుగా పేర్కొనడం గురివిందగింజ సామెతను గుర్తుకు తెస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఒంగోలు సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 28 మంది బడాబాబులు బ్యాంకుల నుండి ప్రజాధనాన్ని కొల్లగొట్టుకొని విదేశాలకు పారిపోయారన్నారు.వారిలో విజయ మాల్య తప్ప మిగతా వారంతా గుజరాతీయులేనని, ప్రధానమంత్రికి బాగా తెలిసిన వారేనన్నారు. అదానీ కుంభకోణం చూసి ప్రపంచ దేశాలు నివ్వెరపోతున్నాయని,అయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా మోడి అండగా నిలుస్తున్నారని చెప్పారు. బీజేపీ అప్రజాస్వామిక పోకడలకు వ్యతిరేకంగా ఏప్రిల్14 నుంచి దేశ వ్యాప్తంగా వామపక్షాలు ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్.వెంకటరావు, డి.శ్రీనివాస్, కె.వీరారెడ్డి పాల్గొన్నారు.


ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



మల్లికార్జున మృతదేహం

కొమరోలు: వ్యక్తిగత కారణాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మాచర్ల సమీపంలోని జాతీయ రహదారి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని బాదినేనిపల్లె గ్రామానికి చెందిన జోగిపర్తి మల్లికార్జున (36) హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పని ఉందని బయటికి వెళ్లి మాచర్ల సమీపంలోని జాతీయ రహదారి పక్కనే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు మాచర్లకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రాణాలు తీసిన పన్ను వివాదం



మృతుడు కాలేషా (ఫైల్)

ఒంగోలు టౌన్: దుకాణానికి సంబంధించిన పన్ను వివాదం చివరికి ఒకరి ప్రాణాల మీదకు వచ్చింది. పోలీసుల వివరాలు ప్రకారం..మండలంలోని త్రోవగుంట ఆటోనగర్‌లో ఒంగోలు లోని ఇస్లాంపేట కబేళా బజారుకు చెందిన షేక్ కాలేషా(70) టైర్ రీ బటన్ షాపు నిర్వహిస్తుంటాడు. బుధవారం ఉదయం షాపు యజమాని షేక్ బాజీ.. షాపుకు సంబంధించి ఆస్తి పన్ను కట్టాలని అడిగాడు. అయితే తాను అద్దెకు దిగక ముందు ఉన్న బకాయిలు కూడా ఉన్నందున పన్ను చెల్లించనని కాలేషా చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆవేశానికి గురైన బాజీ..కోపంతో దాడి చేసి కొట్టడంతో కాలేషా కిందపడిపోయాడు. చుట్టుపక్కల వారు వెంటనే అతన్ని వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాజీ కొట్టిన దెబ్బలకు తాళలేకే తన తండ్రి చనిపోయాడని కాలేషా కుమారులు సంధాని, కరీముల్లా ఆరోపిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షి అయిన మృతుని బంధువు షేక్ జానీబాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




పరీక్షలు ముగిసిన తర్వాత ఆనందోత్సాహాల మధ్య విద్యార్థులు

జోష్..!



టాటా..బైబై..



ఇది సెల్ఫీ టైం...

ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా ఇంటిబాట పట్టారు. పరీక్షల కోసం రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు.. చివరి పరీక్ష పూర్తి కాగానే ఫుల్ జోష్‌తో సందడి చేశారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు బ్యాగులన్నీ సర్దేసుకొని స్నేహితులకు టాటా బై..బై చెబుతూ తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్లిపోయారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్



మళ్లీ కలుద్దాం మిత్రమా..





బ్యాగులన్నీ సర్దేసుకొని ఇంటిబాట..

యూనివర్శిటీ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

- జిల్లా ప్రజానీకం సుదీర్ఘ ఆకాంక్ష సాధిద్దాం
- త్వరలోనే యూనివర్శిటీ డెవలప్‌మెంట్ కమిటీ
- డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సమావేశంలో ఏకేయూ వైస్ ఛాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: యూనివర్శిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో యూజీ, పీజీ కళాశాలల యాజమాన్యాలతో బుధవారం ఆయన సమీక్షించారు. కృష్ణా, విక్రమసింహ యూనివర్శిటీలు ప్రారంభించే నాటికి కనీస భవనాలు, సిబ్బంది కూడా లేరని, కానీ ఆంధ్రకేసరి యూనివర్శిటీకి 109 ఎకరాలు స్థలం, సొంత భవనాలు, పట్టణంలో మరో 3.50 ఎకరాల్లో నిర్మించిన భవనాలు సిద్ధంగా ఉండడం ఎంతో అనుకూలమన్నారు. జిల్లావాసిగా ఏకేయూ వీసీగా తనకు అవకాశం రావడాన్ని తాను గర్విస్తున్నానని, యూనివర్శిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. 37 దేశాల్లోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో అనేక పరిశోధనాపత్రాలు సమర్పించిన అనుభవం ఉందని, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేంద్రంలోని డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ సహకారంతో అనేక పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహించిన అనుభవాన్ని వినియోగించి విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేస్తానన్నారు. పేర్నమిట్టలో కేటాయించిన అకడమిక్ బ్లాక్సను ఏర్పాటుచేస్తామని, రానున్న రోజుల్లో యాజమాన్యాలు, అఫిలియేషన్ పనులకు పేర్నమిట్టకు రావాల్సి ఉంటుందన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి అన్ని పీజీ , డిగ్రీ కాలేజీలు ఆంధ్రకేసరి యూనివర్శిటీకి అనుబంధం అవుతాయన్నారు. యూనివర్శిటీలో రెగ్యులర్‌గా ఉన్న పది మంది ప్రొఫెసర్లకు వివిధ బాధ్యతలు అప్పగించామని, పరీక్షల విభాగం, కాలేజీల అనుబంధ వ్యవహారాలు వంటివి పేర్నమిట్టలోనే నిర్వహిస్తామన్నారు. ఇందుకుగాను యూనివర్శిటీ భవనం వరకు 700 మీటర్ల రోడ్డు వేయాల్సి ఉందన్నారు. ఫారెస్టు, మైనింగ్, మినరల్స్, ఆక్వా కల్చర్‌కు సంబంధించిన కోర్సులను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించిన వారమవుతామన్నారు. అనంతరం ఏకేయూ లోగో విశిష్టతను గురించి వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి ఒంగోలు సిటీ క్యాంపస్‌లో మూడు రెగ్యులర్ భవనాలు, షెడ్లు ఉన్నాయన్నారు. ఇతర వసతులను కల్పించుకుంటూ వేగవంతంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల కాలేజీల సంపూర్ణ సహకారం అవసరం ఉందన్నారు. యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ డి.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతందేవ్‌కుమార్, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ డిగ్రీ, పీజీ, బీఈడీ కాలేజీల యాజమాన్యాలు పాల్గొన్నారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్, డీన్‌లను ఘనంగా సత్కరించారు.

నిమ్జ్ భూముల పరిశీలన



నిమ్జ్ భూముల మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

పామూరు: మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన నిమ్జ్ ప్రతిపాదిత భూములను రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వళవన్.. జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. మాలకొండాపురం వద్ద భూములను పరిశీలించిన కరికాల వళవన్ పామూరు, పీసీపల్లె మండలాల్లో నిమ్జ్‌కు కేటాయించిన సుమారు 12 వేల ఎకరాల వివరాలపై జేసీ, ఏపీఐఐసీ జడ్ఎంతో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఆరు గ్రామాల్లో వివరాలు, ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర భూములపై చర్చించారు. నిమ్జ్ ఏర్పాటు చేయాలంటే ముఖ్య వనరు అయిన నీటి వసతిపై ఆరా తీశారు. ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంతానికి వెలిగొండ రిజర్వాయర్, రాళ్లపాడు ప్రాజెక్టులు ఎంతదూరంలో ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆయన మోపాడు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం, రిజర్వాయర్‌కు నీటిసౌలభ్యం, రిజర్వాయర్ ఆయకట్టు, మోపాడు రిజర్వాయర్‌నీరు నిమ్జ్‌కు ఇచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై జేసీ, ఇతర అధికారులతో చర్చించారు. నిమ్జ్ ప్రాంతానికి రోడ్ కనెక్టివిటీ గురించి అడుగగా 167బీ జాతీయ రహదారితో పాటు ఇదే రహదారికి సీఎస్‌పురం మండలంలో బెంగుళూరు, కడప, విజయవాడ (బీకేవి) రోడ్ జంక్షన్ ఉందని జేసీ వివరించారు. కార్యక్రమంలో రామయపట్నం ప్రత్యేకాధికారి నరసింహారావు, ఏపీఐఐసీ జడ్ఎం వెంకటేశ్వర్లు, పామూరు తహసీల్దార్ బీఆర్ఎల్‌వీ ప్రసాద్, పీసీపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నరగా ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

- విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీవీ సత్యనారాయణ

పామూరు: వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఒంగోలు కేవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం విద్యుత్‌శాఖ పామూరు డివిజన్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల విద్యుత్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండల తీవ్రతకు విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, దాన్ని అధిగమించేందుకు ఇప్పటి నుంచే సిబ్బంది అందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్‌లో రూ.1.60 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, నెలాఖరు లోగా వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సాధారణ మీటర్ల స్థానంలో డిజిటల్ మీటర్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తిచేయాలని, మరమ్మతులకు గురైన వాటిని తొలగించి కొత్త మీటర్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు వ్యవసాయ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన వారికి కనెక్షన్ ఇవ్వాలని, లో ఓల్టేజ్ సమస్య ఎక్కడైనా ఉంటే గుర్తించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా నిరాటంకంగా ఇస్తున్నామన్నారు. వేసవి దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటినెన్స్‌పై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలని, విద్యుత్ బకాయిలు అత్యధికంగా పేరుకుపోయిన రెండు ప్రాంతాలకు సంబంధించి ఇద్దరు ఎల్ఐలను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించామన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ కనిగిరి ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ శ్రీకాంత్, ఏఈలు పామూరు జిలానీ, సీఎస్‌పురం రాజేష్, వెలిగండ్ల రసూల్, షేక్.కాలేషా, సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన పద్ధతుల్లో పంటల సాగు

- జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి



బాపట్ల కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అల్లూరు (కొత్తపట్నం): రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధునాతన పద్ధతిలో సాగు చేయాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. స్థానిక రాజీవ్ కళామందిరంలో జాతీయ సేవా పథకం ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం ఒంగోలు కళాశాల నాల్గో సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రోజు రోజుకూ అనేక కొత్త అధునాతన పద్ధతులు, కొత్త రకం వంగడాలు వస్తూనే ఉన్నాయన్నారు. వారం రోజుల పాటు బాపట్ల కళాశాల విద్యార్థులు నిర్వహించిన వివిధ రకాల కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. డాక్టర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల పరిశోధనలు, వ్యవసాయ విద్యార్థులు అందించే సేవలు రైతులకు తెలియజెప్పినప్పుడే వ్యవసాయంలో అభివృద్ధి పొందగలమని చెప్పారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రవిబాబు మాట్లాడుతూ వారం రోజుల నుంచి నిర్వహించిన జాతీయ సేవా పథకం గురించి తెలిపారు. రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. రైతు సదస్సులో రైతులు అడిగిన ప్రశ్నలకు బాపట్ల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ చంద్రశేఖర్, డాక్టర్ పి.సుధాజాకబ్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు, డాక్టర్ జి.రమేష్ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శేషమ్మ, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, మండల వ్యవసాయాధికారి బీవీ మోహన్‌రెడ్డి, బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ రిప్రంజిటీటివ్ డాక్టర్ విజయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వి.నాగలక్ష్మి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి కఠిన చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐజీ డాక్టర్ తివిక్రమ్ వర్మ

ఒంగోలు టౌన్: గంజాయి నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం తివిక్రమ వర్మ ఆదేశించారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లా ఎస్పీలు, డీఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. గంజాయి విక్రయించే వారిని, వినియోగించే వారిని కట్టడి చేయాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల కేసుల్లో అదే పనిగా నేరాలు చేస్తున్న వారిని గుర్తించి పీడీ యాక్టుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, గుంటూరు ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, మూడు జిల్లాల డీఎస్పీలు పాల్గొన్నారు.

థాంక్యూ..సీఎం సార్

- 393 గ్రూపులకు రూ.3.64 కోట్ల వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులు విడుదల
- కలశాల ఊరేగింపుగా చీమకుర్తి మెయిన్‌రోడ్డులో మహిళల ర్యాలీ



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మెప్మా సభ్యులు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపాలిటీలోని మెప్మా సభ్యులు థ్యాంక్యూ...సీఎం సార్..అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత మున్సిపాలిటీ పరిధిలోని 393 గ్రూపుల్లోని 3,976 మంది సభ్యులకు రూ.3.64 లక్షల డబ్బులు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ కావడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా బుధవారం సభ్యులంతా బోనాలతో ఊరేగింపుగా మెప్మా కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బూచేపల్లి కల్యాణ మండపం వద్దనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, కమిషనర్ ఫజులుల్లా, స్థానిక మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణలో పురోగతి ఉండాలి



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపట్టిన భూ సేకరణ పనుల్లో స్పష్టమైన పురోగతి ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో బుధవారం రెవెన్యూ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ పనులు విధుల నిర్వహణలో మొక్కుబడిగా చేసినా, సమాధానాలు చెప్పినా సహించేది లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకొని పనిచేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే భూ సేకరణ పనుల్లో పురోగతిని సమీక్షించారు. సీఎస్‌పురం మండలంలో పనులు పురోగతి లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ నిర్వాసితుల వివరాలతో కూడిన అవార్డులను ఈ నెలాఖరుకు ప్రకటించాలని ఆదేశించినా ఎందుకు చేయలేకపోయారంటూ డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. అదేవిధంగా కనిగిరి తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏప్రిల్ 15న జిల్లా అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామన్నారు. అసైన్‌మెంట్ ప్రతిపాధనలను 10వ తేదీ లోగా కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఈ ప్రతిపాదనల గుర్తించి స్థానిక ఎమ్మెల్యేలకు ముందుగానే తెలియచేయాలన్నారు. గ్రామాల్లో శ్మశానస్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ సర్వే కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, 13-నోటిఫికేషన్ జారీ ప్రక్రియలో పురోగతిని డివిజన్ అధికారులు ప్రతి వారం సమీక్షించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీలత, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాష, డీపీఓ నారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు శ్రీదేవి, గ్లోరియా, ఉమాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రమేష్

మార్కాపురం: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు చేసి ఉచిత ఉపకరణాలు అందిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాలు కోసం గుర్తించే ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. మానసిక, శారీరక, కళ్లు, చెవుల విభాగంలో నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలను అలెమ్ కో, నిపిడ్ సంస్థల ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు. వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, సీపీ చైర్స్, చంకకర్రలు, వినికిడి యంత్రాలు, బోధనోపకరణ కిట్లు అందిస్తామన్నారు. మొత్తం 164 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్‌నాయక్, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.